క్లుప్తంగా

ఘనంగా పోలేరమ్మ జాతర



అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే రాజా భార్య రాజశ్రీ, సోదరి సింధు

మధురపూడి: కోరుకొండ మండలం గాదరాడ గ్రామ దేవత పోలేరమ్మ జాతర శుక్రవారం ప్రారంభమైంది. ఈ ఉత్సవాలు 14 వతేదీ వరకూ ఐదురోజులు పాటు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. జాతరలో భాగంగా అమ్మవారి వేషధారణలు, గరగ నృత్యాలు నిర్వహించారు. ఎమ్మెల్యే జక్కంపూడి రాజా సతీమణి రాజశ్రీ, సోదరి సింధు.. అమ్మవారికి పూజలు నిర్వహించారు. స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు హరిబోలు చినబాబు, తోరాట శ్రీను, పాలెం నాగవిష్ణు పాల్గొన్నారు.

సాగునీటి ఎద్దడి అరికట్టేందుకు చర్యలు

అనపర్తి: దాళ్వా వరి సాగులో సాగునీటి ఎద్దడి లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఎంపీపీ అంసూరి సూర్యనారాయణ అన్నారు. శుక్రవారం స్థానిక రైతు భరోసా కేంద్రం-5లో రైతు సలహా మండలి సమీక్ష సమావేశం జరిగింది. దీనికి అధ్యక్షత వహించి వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పడాల శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ రబీ సీజన్‌లో రైతులు పండించిన ధాన్యం కొనుగోలుకు సంబంధించి ఏవిధమైన ఇబ్బందులు తలెత్తకుండా ముందుగానే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. అదేవిధంగా వ్యవసాయ యాంత్రీకరణ పరికరాలను రైతులకు గ్రూపులుగా కాకుండా వ్యక్తిగతంగా మంజూరు చేస్తే ఉపయోగంగా ఉంటుందని, దీనిపై దృష్టి సారించాలని కోరారు. మండల వ్యవసాయాధికారి సురేష్‌కుమార్, ఇరిగేషన్ అధికారి శ్రీనివాస్, ఫిషరీస్ అసిస్టెంట్ లావణ్య, అగ్రికల్చర్ అసిస్టెంట్ శరత్ తదితరులు పాల్గొన్నారు.

పంట కొనుగోలుకు నమోదు

రంగంపేట: మండలంలో రబీ సీజన్‌లో శెనగలు పండించిన రైతులు పంట కొనుగోలు కోసం రైతు భరోసా కేంద్రాల్లో నమోదు చేయించుకోవాలని ఆర్‌బీకేల సిబ్బంది తెలిపారు. దీని కోసం రైతులు తమ ఆధార్ కార్డు నకలుతో సంప్రదించాలన్నారు.

రాయితీపై యంత్ర పరికరాలు

బిక్కవోలు: మండలంలోని సీహెచ్‌సీ గ్రూపుల ద్వారా రాయితీపై యంత్ర పరికరాలు అందిస్తున్నట్లు వ్యవసాయ శాఖ ఏఓ సామ్యూల్ జాన్ అన్నారు. శుక్రవారం బలభద్రపురం సచివాలయం వద్ద సర్పంచ్ బుంగా రామారావు అధ్యక్షతన వ్యవసాయ శాఖ సలహా మండలి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జాన్ మాట్లాడుతూ గత ఏడాది పది గ్రూపులకు యంత్ర పరికరాలు అందించామన్నారు. ఈ ఏడాది కూడా ఇస్తామన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ నల్లమిల్లి వెంకటరెడ్డి, తహసీల్దార్ పోసిబాబు తదితరులు పాల్గొన్నారు.

14న నులిపురుగుల నివారణ కార్యక్రమం



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ రాజు

సీతానగరం: మండలంలో జరిగే నులిపురుగుల నివారణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ ఎస్.రాజు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఐసీడీఎస్, అంగన్‌వాడీ టీచర్లు, వైద్య సిబ్బందితో శుక్రవారం జరిగిన సమావేశంలో పీహెచ్‌సీ డాక్టర్ రాజు, ఎంపీడీవో కె.రమేష్, పీహెచ్‌సీ సీహెచ్‌వో పి.రాధాకృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ రాజు మాట్లాడుతూ ఈనెల 14న నిర్వహించే కార్యక్రమానికి కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో 12,570 మంది విద్యార్థులు ఉన్నారని, వీరందరితో నులిపురుగుల నివారణ మాత్రలు మింగించాలన్నారు. మిగిలిన వారికి ఈనెల 18న పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్ఎంలు, పీహెచ్‌సీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆమె నేత్రాలు అజరామరం

బిక్కవోలు: ఊలపల్లి గ్రామంలో రామవరపు రాజులమ్మ (78) అనారోగ్యంతో మృతి చెందడంతో ఆమె నేత్రాలను కాకినాడ బాదం బాలకృష్ణ ఐ బ్యాంకుకు దానం చేశారు. ఈ విషయాన్ని ఊలపల్లి వివేకానంద సేవా సమితి అధ్యక్షుడు దారపురెడ్డి శ్రీను తెలిపారు. మృతురాలి కుమారుడు వెంకటరమణ సహకారంతో నేత్రదానం చేశారన్నారు. ఆమె కుటుంబ సభ్యులను పలువురు అభినందించారు.

ఇసుక ట్రాక్టర్ల సీజ్

సీతానగరం: మండలంలోని ముగ్గళ్ల ర్యాంపు నుంచి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను ఎస్ఈబీ ఎస్సై ఐ.దుర్గా నాగేశ్వరరావు శుక్రవారం సీజ్ చేశారు. వాటిని సీతానగరం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. దీనిపై కేసు నమోదు చేశామని ఎస్సై కె.శుభశేఖర్ తెలిపారు.

టీకాతో శ్రీరామరక్ష



సీతానగరంలో గేదెకు గాలికుంటు నివారణ టీకా వేస్తున్న ఏహెచ్ఏలు

- గాలికుంటు వ్యాధిపై అప్రమత్తత అవసరం
- సకాలంలో వైద్యం అందకపోతే మృత్యువాతే
- ముమ్మరంగా వ్యాక్సినేషన్ ప్రక్రియ



దోమాడలో వ్యాక్సిన్ వేస్తున్న వైద్యురాలు

పెదపూడి/సీతానగరం: పచ్చని నేస్తాలు పుడమి పుత్రులకు ఆధారమైతే.. పాడి సంపద అదనపు ఆదాయం తెచ్చి పెడుతోంది. సాగుతో సమానంగా వీటినీ రైతులు కాపాడుకోవాల్సిన ఆవశ్యకత ఉంది. వాతావరణ మార్పులతో పశువులకు ప్రధానంగా గాలికుంటు వ్యాధి సోకే అవకాశం ఉంది. సకాలంలో వ్యాక్సిన్ వేస్తే వ్యాధి నుంచి రక్షణ పొందవచ్చు. ఈ నేపథ్యంలో మూగజీవాల రక్షణకు ప్రభుత్వం ఉచిత టీకాల కార్యక్రమం చేపట్టింది. ప్రస్తుతం అనపర్తి, రాజానగరం నియోజకవర్గాల్లో అన్ని పశు వైద్యశాలల ఆధ్వర్యంలో వ్యాక్సినేషన్ కార్యక్రమం ముమ్మరంగా సాగుతోంది. పశు పోషకులు టీకాలు వేయించి పశువులను కాపాడుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. అనపర్తి, రాజానగరం నియోజకవర్గాల్లోని అనపర్తి, బిక్కవోలు, పెదపూడి, రంగంపేట, రాజానగరం, సీతానగరం, కోరుకొండ మండలాల్లో సుమారు 80,657 గేదెలు, 32,420 ఆవులు ఉన్నాయి. ఆయా గ్రామాల్లో గోపాలమిత్రలు గతేడాది పశువులకు ట్యాగ్‌లు వేశారు. ప్రస్తుతం ట్యాగ్‌ల ఆధారంగా పశువులను గుర్తించి టీకాలు వేస్తున్నారు. ఇప్పటి వరకూ పశువులకు ట్యాగ్ వేయించుకోకపోతే వెంటనే వేయించాలని అధికారులు సూచిస్తున్నారు.

ముందుగానే గుర్తిస్తే మంచిది



పశువులు గాలికుంటు వ్యాధి బారిన పడకముందే వ్యాక్సిన్ వేయించాలి. వ్యాధి వచ్చినట్టు గుర్తిస్తే వెంటనే పశు వైద్యులను సంప్రదిస్తే ఫలితం ఉంటుంది. వ్యాధి రాక ముందు వ్యాక్సిన్ వేయిస్తే మంచిది. వ్యాధులు సోకిన పశువులను పశు వైద్యులకు వెంటనే చూపిస్తే వైద్యం అందించి రోగం ప్రబలకుండా నివారించవచ్చు. లేకపోతే అవి చనిపోతాయి.

– చింతా కిరణ్మయి, పశు వైద్యాధికారి, పెదపూడి మండలం

ప్రతి పశువుకు టీకా వేస్తాం



ఆవులు, ఎద్దులు, గిత్తలు, గేదెలు, దున్నలకు గాలికుంటు నివారణ టీకాలను నేరుగా వెళ్లి రైతుల పశువుల పాక వద్ద వేస్తున్నాం. ఇప్పటి వరకు 2,500 పశువులకు టీకాలు వేశాం. రైతులు సహకరించి తమ పశువులకు టీకాలు వేయించుకోవడానికి ముందుకు రావాలి. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– డాక్టర్ ఆంధ్ర ఫణీంద్ర, పశువైద్యుడు, చినకొండేపూడి

పశువుల పాకల వద్దే టీకాలు



గతంలో పశువులకు వ్యాధి సోకితే పశువుల ఆసుపత్రికి తీసుకువెళ్లి వైద్యం చేయించేవాళ్లం. టీకాలు వేయించడానికి అవకాశం ఉండేది కాదు. వైఎస్సార్ సీపీ అధికారం చేపట్టిన తరువాత ఆర్బీకేల ద్వారా ఎంతో లబ్ధి పొందుతున్నాం. పశువుల వద్దకు వచ్చి గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు ఉచితంగా వేస్తున్నారు. ముఖ్యమంత్రి జగన్‌కు కృతజ్ఞతలు.

– తోరం బ్రహ్మాజీ, రైతు, సీతానగరం

వ్యాధి లక్షణం.. నివారణా మార్గం

పశువులకు గాలికుంటు వ్యాధి సోకిన వెంటనే జ్వరం వస్తుంది. నాలుక, చిగుళ్లు, కాలు గిట్టల మధ్య పుండ్లు ఏర్పడతాయి. ఆహారం తీసుకోవు, ఎక్కువ సేపు నిలబడలేవు. ఎక్కువ దూరం నడవలేవు. నురగ కక్కుతూ ఉంటాయి. వ్యాధి సోకిన పశువులను వెంటనే గుర్తించి గుంపు నుంచి వేరుచేసి కట్టాలి. ఇలా చేయకపోతే ఇతర పశువులకు ఈ వ్యాధి సోకే ప్రమాదం ఉంది. వెంటనే పశు వైద్యుడిని సంప్రదించి వైద్యం చేయించాలి. వ్యాధి సోకకముందే ఎఫ్ఎండీ వ్యాక్సిన్ వేయించాలి. సోకిన తరువాత వైద్యుల సూచనలతో మందులు వాడాలి.

అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు



కొంకుదురులో మార్కెట్ షెడ్డును పరిశీలిస్తున్న ఏఎంసీ చైర్మన్ కృష్ణారెడ్డి

బిక్కవోలు: కొంకుదురు మార్కెట్ షెడ్డు, అనపర్తి మార్కెట్ అభివృద్ధి పనులకు ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపామని ఏఎంసీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి తెలిపారు. శుక్రవారం కొంకుదురు గ్రామంలోని మార్కెట్ షెడ్లను అనపర్తి వ్యవసాయ శాఖ సహాయ సంచాలకుడు సుధాకర్‌తో కలసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ కొంకుదురులో నిర్మించిన మార్కెట్ షెడ్లుకు చుట్టూ ప్రహరీ నిర్మిస్తామన్నారు. అనపర్తిలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయానికి ప్రహరీ నిర్మాణం వంటి పనులకు ప్రతిపాదనలు చేశామన్నారు. నిధులు మంజూరైన తర్వాత పనులు చేపడతామన్నారు. సొసైటీ అధ్యక్షుడు సత్తి నాగిరెడ్డి రాజా, ఎంపీటీసీ కొంకుదురు పీవీ తదితరులు పాల్గొన్నారు.

ఆల్బెండజోల్ మాత్రలు వేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ విజయభాస్కర్

పెదపూడి: పొట్టలో నులి పురుగులు ఉంటే తిన్న ఆహారం ఒంటికి పట్టదని, దీని నివారణకు ఆల్బెండజోల్ మాత్రలను వేసుకోవాలని ఎంపీడీఓ పి.విజయభాస్కర్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం పెద్దాడ, సంపర పీహెచ్‌సీ వైద్యులు సురేఖ, సంతోష్ ఆధ్వర్యంలో ఆల్బెండజోల్ మాత్రల పంపిణీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయభాస్కర్ మాట్లాడుతూ పిల్లలు తప్పనిసరిగా ఈ మాత్రలు వేసుకోవాలన్నారు. వైద్యులు సురేఖ, సంతోష్ మాట్లాడుతూ 1 నుంచి 19 ఏళ్ల లోపు పిల్లలు, కిశోర బాలలకు ఆల్బెండజోల్ మాత్రలు మింగించాలన్నారు. మండలంలో మొత్తం 12,240 మందికి ఈ నెల 14న మాత్రలు అందిస్తామన్నారు. ఈఓపీఆర్డీ కె.హరికృష్ణ సత్యరెడ్డి, సూపర్‌వైజర్ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

'మా నమ్మకం నువ్వే జగనన్న' ప్రతిధ్వనించాలి

- సీఎం జగన్‌తోనే అవినీతి రహిత పాలన
- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా



సీతానగరంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

సీతానగరం: మా నమ్మకం నువ్వే జగనన్న అనే నినాదం ప్రతి ఇంటా ప్రతిధ్వనించాలని, ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలతో పాటు అవినీతి రహిత పాలన కొనసాగాలంటే మనకున్న ఏకైక నమ్మకం ముఖ్యమంత్రి జగనన్న మాత్రమేనని ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అన్నారు. స్థానిక సీతానగరం బస్టాండ్ సెంటర్‌లోని గీతా బాలాజీ థియేటర్‌లో శుక్రవారం సచివాలయ కన్వీనర్లు, గృహసారథుల (జేసీఎస్) సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జక్కంపూడి రాజా మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అనంతరం రాష్ట్రమంతటా 175 నియోజకవర్గాల్లో గృహసారథుల కార్యాచరణ ఒకేసారి మొదలవుతుందన్నారు. ఆ కార్యక్రమానికి కన్వీనర్లు, గృహసారథులు సంసిద్ధంగా ఉండాలన్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక ఏర్పాటు చేసిన వలంటీర్లపై అపార విశ్వాసం ఉంచామని, ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా నిలబెట్టామన్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి మండలంలో ముందెన్నడూ లేని విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చామని, ఈ వ్యత్యాసాన్ని గుర్తించి, ప్రజల్లోకి తీసుకెళ్లి మరోసారి వైఎస్సార్ సీపీని ప్రజలు ఆశీర్వదించేలా గృహసారథులు కృషి చేయాలన్నారు.

చురుగ్గా రహదారి పనులు

రాజమహేంద్రవరం నుంచి సీతానగరం రహదారిని సుమారు రూ.105 కోట్లతో నాలుగు లైన్లు రహదారి పనులు చేపట్టామన్నారు. ఆగస్టు నాటికి రాకపోకలకు అనువుగా పనులు చేస్తామన్నారు. సీతానగరం పీహెచ్‌సీని 30 పడకల సీహెచ్‌సీగా అభివృద్ధి పరిచి, రఘుదేవపురం రోడ్డును ఆనుకుని నిర్మాణానికి కృషి చేస్తున్నామన్నారు. బొబ్బిల్లంకలో పీహెచ్‌సీని నెలకొల్పుతామన్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి సాగునీటిని పుష్కలంగా అందిస్తున్నామన్నారు. తొర్రిగడ్డ పంపింగ్ స్కీమ్ ఆధునీకరణ, బొబ్బిల్లంక – ములకల్లంక బ్రిడ్జి నిర్మాణ తదితర పనులు జగనన్న ప్రభుత్వం కారణంగా సాధ్యమైందన్నారు. అనంతరం చినకొండేపూడిలో తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్మిస్తున్న కల్యాణ మండపం పనులను సంబంధిత అధికారులు, పార్టీ నాయకులు, కమిటీ సభ్యులతో ఎమ్మెల్యే జక్కంపూడి రాజా పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, నియోజకవర్గం బూత్ కమిటీల చైర్మన్, పార్టీ చేరికల కమిటీ కన్వీనర్ గద్దె వెంకటకృష్ణ చౌదరి (నల్లి), మండల కన్వీనర్ ఘంటా శ్రీనివాస్, కోకన్వీనర్ కరుటూరి శ్రీహరిబాబు, వైస్ ఎంపీపీ-1 ముదునూరి సురేష్‌రాజు, మండల సర్పంచ్‌ల సమాఖ్య సంఘం అధ్యక్షుడు కొండ్రపు ముత్యాలు, పార్టీ నాయకులు చల్లమళ్ల సుజీరాజు, సత్యం రాంపండు, కవల కృష్ణమూర్తి, మద్దాల కొండలరావు, సత్తి పండురాజు పాల్గొన్నారు.

వైభవంగా గ్రామ దేవతల జాతర



అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి తదితరులు

అనపర్తి: మహేంద్రవాడ గ్రామ దేవతలు గోగులమ్మ, భూలోకమ్మవార్ల జాతర మహోత్సవాలు శుక్రవారం జరిగాయి. కోరిన కోర్కెలు తీర్చే గ్రామ దేవతలుగా పూజలందుకుంటున్న అమ్మవార్లను ప్రజలు కొలిచారు. జాతరను పురస్కరించుకుని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, రాష్ట్ర మారిటైం బోర్డ్ చైర్మన్ కాయల వెంకటరెడ్డి, సర్పంచ్ మల్లిడి గంగరాజు, గ్రామ ప్రముఖులు పడాల ధర్మారెడ్డి, మల్లిడి శ్రీనివాసరెడ్డి, కొవ్వూరి జగ్గిరెడ్డి, శివాలయం చైర్మన్ సబ్బెళ్ల సత్తిరెడ్డి తదితరులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

జీఎస్ఎల్‌లో ఫిజియోథెరపీ కాన్ఫరెన్స్



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా తదితరులు

రాజానగరం: జీఎస్ఎల్ వైద్య కళాశాల, ఆస్పత్రుల ద్వారా రోగులకు మెరుగైన వైద్య సేవలు లభిస్తున్నాయని స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. ముఖ్యంగా కరోనా సమయంలో అత్యుత్తమ వైద్యసేవలు అందించి, వేలమంది ప్రాణాలను కాపాడారన్నారు. జీఎస్ఎల్ వైద్య కళాశాలలో రెండు రోజుల పాటు జరిగే ఏడవ జాతీయ ఫిజియోథెరపీ కాన్ఫరెన్స్‌ను శుక్రవారం ప్రారంభించారు. ఫిజియోథెరపీలో వస్తున్న మార్పులు, సవాళ్లు, కొత్త విధానాలు, అనుభవాల నుంచి నేర్చుకున్న ఈజీ మెథడ్స్‌పై ఈ సదస్సులో చర్చిస్తామని ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ పి.అప్పారావు తెలిపారు. కార్యక్రమంలో జీఎస్ఎల్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు, కర్ణాటక హెల్త్ సైన్సెస్ యూనివర్సిటీ సిండికేట్ మెంబర్ డాక్టర్ యూటీ ఇఫ్తికార్ ఆలీ, ఏపీ స్టేట్ ఎలైడ్ హెల్త్ కేర్ కౌన్సిల్ చైర్‌పర్సన్ డాక్టర్ కె.మాధవి, ఇండియన్ ఫిజియోథెరపిస్టు అసోసియేషన్ ట్రెజరర్ డాక్టర్ కె.రుషివర్షిణి, వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ ఎ.సురేష్‌బాబురెడ్డి పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి



పెదపూడిలో పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

పెదపూడి: గ్రామాల్లో జరిగే అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. మండలంలోని పైన, పెదపూడి గ్రామాల్లో గ్రాసీం ఇండస్ట్రీస్ సౌజన్యంతో నిర్మిస్తున్న కల్చరల్ యాక్టివిటీస్ భవన నిర్మాణ పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. అలాగే గ్రామంలో పలు అభివృద్ధి పనులను చూశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి పనుల్లో పారదర్శకత పాటించాలన్నారు. ఎంపీపీ కేత తులసి, సర్పంచులు కోసూరి శ్రీనివాస్, సుందరపల్లి ప్రమీళ, ఎంపీటీసీ సమ్మంగి దుర్గాప్రసాద్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గుత్తుల వెంకటరమణ, బీసీ సెల్ కన్వీనర్ పప్పు సింహాచలం, సొసైటీ చైర్మన్ మార్ని కామరాజు చౌదరి పాల్గొన్నారు.

మహిళలకు తగిన గౌరవం ఇవ్వాలి



మహిళా దినోత్సవ సభలో మాట్లాడుతున్న విజయగౌరి

రంగంపేట: తల్లిగా, చెల్లిగా, భార్యగా సేవలందిస్తున్న మహిళలకు సమాజం తగిన గౌరవం ఇవ్వాలని యూటీఎఫ్ జిల్లా అసోసియేట్ ఎం.విజయగౌరి తెలిపారు. రంగంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. దీనికి అధ్యక్షత వహించిన ఆమె మాట్లాడుతూ మహిళలు నేటికీ హక్కుల కోసం పోరాటాలు చేస్తూనే ఉన్నారని అన్నారు. అతివలు అన్ని రంగాల్లో రాణించాలంటే హక్కుల పరిరక్షణకు నడుం బిగించాలన్నారు. చట్టసభల్లో మహిళలకు ఇచ్చిన రిజర్వేషన్లు పూర్తిస్థాయిలో అమలు పరిచే విధంగా ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వం కృషి చేయాలని ఆమె కోరారు. సైకత శిల్ప కళలో ప్రావీణ్యం పొందిన దేవిన సోదరీమణులు సోహిత, ధన్యతలను, శాస్త్రీయ నాట్యంలో మంచి ఫలితాలు సాధిస్తున్న పి.బాల సరస్వతిని జ్ఞాపికలతో సత్కరించారు. మండల యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి ఐ.విజయబాబు, కోశాధికారి కోరుమిల్లి శ్రీనివాస్, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

హక్కులపై అవగాహన అవసరం



సమావేశంలో మాట్లాడుతున్న అడ్వకేట్ కేవీఎస్ రత్నం

పెదపూడి: మహిళలకు రాజ్యాంగం కల్పించిన హక్కులు, విధులపై అవగాహన కలిగి ఉండాలని కాకినాడ ఎంఎల్ఎస్‌సీ ప్యానల్ అడ్వకేట్ కేవీఎస్ రత్నం అన్నారు. పెదపూడి సచివాలయం-1 వద్ద శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో భాగంగా మండల న్యాయ సేవాధికార సంస్థ కాకినాడ వారి ఆదేశాల మేరకు న్యాయ విజ్ఞాన అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల హక్కుల పరిరక్షణపై అవగాహన కల్పించారు. మహిళలు అడిగిన పలు ప్రశ్నలకు ఆయన సమాధానాలు చెప్పారు. ఈ కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శి మన్యం శ్రీనివాస్‌చౌదరి, కాకినాడ ఎంఎల్ఎస్‌సీ ప్యానల్ అడ్వకేట్స్ టి.రాజేష్, కేవీ శివప్రసాద్, ఇతర న్యాయవాదులు కె.చిట్టిబాబు, సీహెచ్ వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్ట్స్ కళాశాలలో గెస్ట్ లెక్చర్

కంబాలచెరువు: స్థానిక ప్రభుత్వ కళాశాల మహిళా సాధికారత కమిటీ, ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం గెస్ట్ లెక్చర్ (అతిథి ఉపన్యాసం) నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ కృష్ణ ప్రారంభించారు. ప్రారంభ ఉపన్యాసంలో మహిళా సాధికారత ప్రాముఖ్యతను ఆయన వివరించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ ఓవీ ఇందిర మాట్లాడుతూ ఆహార నియమాలు, రక్తహీనత నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. విద్యార్థినులకు ప్రత్యేక కౌన్సెలింగ్ ఇచ్చారు. మహిళా సాధికారత కమిటీ కన్వీనర్ డాక్టర్ ఎం. పుష్పాంజలి మాట్లాడుతూ మహిళల ఆరోగ్యమే సాధికారతకు మూలమన్నారు.

రబీ ధాన్యం కొనుగోలుకు సిద్ధం కావాలి



సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ సత్రాజు

మధురపూడి: రబీ ధాన్యం కొనుగోలుకు వ్యవసాయ శాఖ సిబ్బంది సన్నద్ధం కావాలని కోరుకొండ వ్యవసాయ సలహా మండలి చైర్మన్ క్రొవ్విడి సత్రాజు అన్నారు. కోరుకొండ మండలం కాపవరం ఎంపీడీఓ కార్యాలయంలోని మీటింగ్ హాలులో శుక్రవారం వ్యవసాయ సలహామండలి సమావేశం నిర్వహించారు. అధ్యక్షతన వహించిన క్రొవ్విడి సత్రాజు మాట్లాడుతూ ఖరీఫ్‌లో మండలంలో 13,600 ఎకరాల విస్తీర్ణంలో పండించిన 6 వేల మంది రైతుల నుంచి 20 వేల మెట్రిక్ టన్నులు ధాన్యాన్ని కొనుగోలు చేయడం జరిగిందన్నారు. రబీ సీజన్‌కు సంబంధించి 5,500 ఎకరాల విస్తీర్ణంలో పంటలకు ఈ–క్రాఫ్ నమోదు చేశామన్నారు. ప్రభుత్వం ద్వారా పచ్చిరొట్ట, పిల్లి పెసర విత్తనాలను ఈ నెలాఖరుకు రైతులకు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. వైఎస్సార్ యాప్‌లో సిబ్బంది విధిగా వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆశాఖ ఏడీఏ బీకే మల్లికార్జునరావు, కోరుకొండ తహసీల్దార్ పాపారావు, వైఎస్సార్ సీపీ మండల మాజీ కన్వీనర్ ఉల్లి బుజ్జిబాబు, వ్యవసాయ శాఖ కోరుకొండ మండల అధికారి గౌరాదేవి, పశుసంవర్ధకశాఖ వైద్యుడు రాజశేఖర్ పాల్గొన్నారు.

కుక్కల సంతతి నియంత్రణకు చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న ఈఓపీఆర్డీ హరికృష్ణ సత్యరెడ్డి

పెదపూడి: గ్రామాల్లో కుక్కల సంతతి పెరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ సిబ్బందికి అవగాహన సదస్సు నిర్వహించారు. దీనికి ఈఓపీఆర్డీ కర్రి హరికృష్ణ సత్యరెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా హరికృష్ణ సత్యరెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో కుక్కల సంఖ్యను లెక్కించి వాటికి పిల్లలు పుట్టకుండా సచివాలయ కార్యదర్శులు ఆపరేషన్లు చేయించాలన్నారు. కుక్క కరిచిన వెంటనే తీసుకోవాల్సిన చికిత్స, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. మండల పశు వైద్యాధికారి చింతా కిరణ్మయి మాట్లాడుతూ పెంపుడు జంతువులకు యాంటీ రేబిస్ వ్యాక్సిన్ వేయించాలన్నారు. పెద్దాడ, సంపర ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు ప్రత్యూష, సంతోష్ మాట్లాడుతూ కుక్క కరిచిన వెంటనే ఆసుపత్రికి వెళ్లి చికిత్స పొందాలన్నారు.

ఎస్కేఆర్ విద్యార్థినుల ఫీల్డ్ విజిట్

కంబాలచెరువు: స్థానిక కందుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వ మహిళా కళాశాల బీకామ్ మొదటి సంవత్సరం విద్యార్థినులకు స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సులో భాగంగా శుక్రవారం ఫీల్డ్ విజిట్ నిర్వహించారు. ప్రిన్సిపల్ డాక్టర్ పి.రాఘవ కుమారి ఆధ్వర్యంలో వాణిజ్య శాఖ విభాగం అధ్యాపకులు ఫెడరల్ ఇన్సూరెన్స్ కంపెనీకి విద్యార్థినులను తీసుకువెళ్లి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బ్రాంచ్ మేనేజర్ జయంతి పద్మావతి మాట్లాడుతూ వేరియస్ ఫెడరల్ బీమా ఉత్పత్తులను వివరించారు. కార్యక్రమంలో బ్రాంచ్ ప్రమోషనల్ మేనేజర్ జె.శ్రీనివాస్, వాణిజ్య శాఖ ఫ్యాకల్టీ మెంబర్లు మేజర్ డాక్టర్ బి.కల్యాణి, సత్యవాణి, వి.సూరిబాబు ఎస్.లక్ష్మి పాల్గొన్నారు.

13న వాహనాల వేలం

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో రాజమహేంద్రవరం సౌత్‌స్టేషన్ పరిధిలో సారా, ఇతర నేరాల్లో పట్టుకున్న 21 మోటారు వాహనాలకు ఈనెల 13వ తేదీ సోమవారం ఉదయం 10 గంటలకు స్టేషన్ ఆవరణలో వేలం నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని ఇన్‌స్పెక్టర్ పి.హనుశ్రీ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొనేవారు ఆధార్‌కార్డు జిరాక్స్‌తో పాటు, రూ.5 వేలు ధరావత్తు చెల్లించాలన్నారు. వేలంలో వాహనాలు దక్కించుకున్నవారు పాడిన మొత్తాన్ని 18 శాతం జీఎస్టీతో చెల్లించాలన్నారు. ఇతర వివరాలకు 96187 33879, 93981 90039 నంబర్లను సంప్రదించాలన్నారు.

శ్రమకాలం ప్రత్యేకారాధనలు

మధురపూడి: ఏసుక్రీస్తు శ్రమలను అనుభవించి శిలువపై మరణించిన రోజుగా శుక్రవారం కోరుకొండ మండలంలో క్రైస్తవులు ప్రత్యేకారాధన నిర్వహించారు. పశ్చిమగానుగూడెం సెయింట్ లూథరన్ చర్చిలో రెవరెండ్ పాస్టర్ కృపావిల్సన్ ఆధ్వర్యంలో శిలువ జ్ఞానం కార్యక్రమం జరిగింది. బూరుగుపూడి, గాడాల, దోసకాయలపల్లి చర్చిల్లోనూ ఈ కార్యక్రమం నిర్వహించారు. ఫిబ్రవరి 22న ప్రారంభమైన శ్రమకాలం ప్రార్థనలు ఏప్రిల్ 9 వరకూ జరుగుతాయి. పశ్చిమగానుగూడెం చర్చిలో సంఘపెద్దలు గొల్లపల్లి ప్రవీణ్, ఈతకొట్టు ఎజ్రా, వరదానం పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు చర్యలు

రాజమహేంద్రవరం రూరల్: హుకుంపేట జాతీయ రహదారి నుంచి తూర్పురైల్వేస్టేషన్‌కు వెళ్లే ఆర్అండ్‌బీ రోడ్డులో కల్వర్టుకు పిట్టగోడలు లేకపోవడంతో శుక్రవారం 'సాక్షి'లో ప్రమాదకరంగా కల్వర్టు అనే శీర్షికన వార్త ప్రచురితమైంది. దీనిపై అధికారులు స్పందించారు. పంచాయతీ కార్యదర్శి జి.వెంకటరావు ప్రస్తుతానికి ప్రమాదాలు జరగకుండా కల్వర్టు వద్ద ఎర్రటి తెరను ఏర్పాటు చేశారు.